క్లుప్తంగా

వీఆర్‌ఏలకు మద్దతు ఇవ్వండి



బొప్పరాజుతో మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు

రొంపిచెర్ల : వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లను చిత్తూరు జిల్లా వీఆర్‌ఏల సంఘం నాయకులు లక్ష్మణ్ మంగళవారం విజయవాడలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని తెలిపారు. వీఆర్‌ఏలకు పే–స్కేల్, అర్హులకు పదోన్నతులు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు.

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న నేతలు

పులిచెర్ల(కల్లూరు): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమలకు గోవింద మాల ధరించి కాలినడకన వెళుతున్న సుమారు 600 మంది కర్ణాటక భక్తులకు మంగళవారం చల్లావారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జి.శివకుమార్ అన్నదానం చేశారు. అయిదేళ్ల నుంచి క్రమం తప్పకుండా తిరుమలకు వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం చేస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక భక్తులు వీరి కుటుంబాన్ని సారె, చీరలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సి.నాధమునిరెడ్డి, మండల బీసీ నాయకులు ఎస్‌పీ రమణ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



ఆందోళన చేస్తున్న నేతలు

పెద్దపంజాణి: పార్లమెంటు సమావేశాల్లో భారత రాజ్యాంగంపైన జరిగిన చర్చలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను పలమనేరు ఇన్‌చార్జ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బీవీఎం శివశంకర్ తీవ్రంగా ఖండించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులతో కలసి ఆయన మంగళవారం ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కించపరిచేలా అమిత్‌షా మాట్లాడారని భేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, మండల పార్టీ ప్రెసిడెంట్ శంకర్ కుమార్, నేత దొరస్వామి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాప్ ద్వారా వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల ఐడీలు, ఎన్‌సీడీ స్కానింగ్ సర్వే చేయడంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు దగ్గు, జ్వరం, జలుబు, గొంతునొప్పి, ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ పెన్షనర్ల సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు: పట్టణంలోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సమావేశం సంఘ అధ్యక్షుడు రత్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ల క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ముఖ్యంగా లైఫ్ సర్టిఫికెట్‌ను ఎలా పొందాలి, ఎవరికి సమర్పించాలో నేతలు వివరించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన డీఏ బకాయిలను విడుదల చేయాలని వారు కోరారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పంలో కూటమి పుష్పాలు

కుప్పంలోని ఓ మిల్లు వద్ద నిలిచిన కలప ట్రాక్టర్



కొటాలూరు అటవీ ప్రాంతంలో విచ్చలవిడిగా నరికేసిన చెట్లు (ఫైల్)



- పక్క రాష్ట్రాలకు యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- తరిగిపోతున్న వృక్ష సంపద
- కుప్పంలో వాల్టా చట్టానికి తూట్లు
- అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు

కుప్పంరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పథకాన్ని పర్యావరణ హితంగా తీసుకొస్తున్నట్లు పదేపదే తన ప్రసంగాల్లో వల్లిస్తూనే ఉంటారు. పర్యావరణ హితమే మా మొదటి ప్రాధాన్యత అంటూ ఆయన మాటల్లో ప్రస్ఫుటమవుతుంది. అక్కడి వరకు అయితే బాగానే ఉంది కానీ తన సొంత నియోజకవర్గంలో తమ్ముళ్లు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ పర్యావరణ హననానికి పాల్పడుతున్నారు. దీంతో కుప్పంలో పచ్చదనం హరించుకుపోయి, విలువైన చెట్లు నేలకొరుగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీల్లో కలపను కర్ణాటక, తమిళనాడుకు తరలించేస్తున్నారు. అధికారులు, చట్టాలు ఉన్నా కుప్పంలో పనిచేయడం లేదు. దీంతో కలప అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇందుకు ఉదాహరణే శనివారం ఒక్కరోజే అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్ల కలపను అటవీ అధికారులు పట్టుకోవడం.



అటవీ అధికారులు పట్టుకున్న కలప ట్రాక్టర్లు

సరిహద్దులు దాటుతున్న కలప

కుప్పం అటవీ ప్రాంతం, పొలం గట్లపై అరుదైన వేప, ఉసిరి, మామిడితో పాటు ఇతర రకాల చెట్లు ఉన్నాయి. తైలం చెట్లు అయితే రైతులు పంట పొలాల్లో సాగుచేస్తున్నారు. ఈ చెట్లను ఇది వరకు తమిళ, కర్ణాటక వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రిపూట నరికి రవాణా చేసుకునే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో రాత్రి పగలు తేడా లేకుండా కలపను తరలించే పనిలో కూటమి నాయకులు పడ్డారు. తైలం చెట్లకు సాగు చేసి అమ్ముకునేందుకు అనుమతులు ఉన్నాయి. తైలం చెట్లు రోజూ దొరక్కపోవడంతో అక్రమార్కులు విలువైన చెట్లు అయిన వేప, ఉసిరి, తంగేడు, నేరేడు, మామిడి వంటి వాటిపై పడుతున్నారు. అడవి, పొలం అంటూ చెట్లను నరికి తమిళనాడు తిరుపత్తూరు, నాట్రంపల్లి, కర్ణాటకలోని కెంపాపురం, కేజీఎఫ్‌లకు తరలించేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో జోరుగా అక్రమ రవాణా

కూటమి ప్రభుత్వం రావడంతో నాయకులు అక్రమంగా గ్రానైట్, తమిళ బియ్యం, ఇసుక వంటి వ్యాపారాలకు పాల్పడుతున్నారు. తాజాగా కుప్పంను పచ్చదనంతో కప్పి ఉంచుతున్న పచ్చని చెట్లపై పడింది. తమిళనాడు, కర్ణాటకలో టన్ను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పలుకుతోంది. దీంతో ఒక ట్రాక్టర్ లోడు తరలిస్తే రూ.20 వేల వరకు వస్తుంది. ఖర్చులుపోను లోడుకు రూ.10 వేల వరకు మిగులుతుండడంతో తమ్ముళ్లు కలప రవాణాపై ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం ఒక్కరోజే అధికారులు మాటు వేసి కర్ణాటకకు తరలుతున్న 6 ట్రాక్టర్ల కలపను పట్టుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా తయారైందో అర్థమవుతుంది. నిత్యం పెద్ద ఎత్తున ఈ కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులు కొన్ని మార్లు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

పూత ఆలస్యంపై ఆందోళన వద్దు

రొంపిచెర్ల : గత ఏడాది వర్షాలు ఎక్కువగా పడడంతో మామిడి పంటలో పూత ఆలస్యంపై ఆందోళన పడొద్దని ఉద్యాన శాఖ అధికారిణి సంతోషికుమారి అన్నారు. మంగళవారం బండకిందపల్లె రైతు సహాయ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన ప్రాంతంలో ముందుగా రావాల్సిన పూత ఆలస్యంగా వస్తుందన్నారు. అయితే మామిడి రైతులు మోనో క్రోటోఫాస్ లీటరుకు 2 మిల్లీలు, రెండు గ్రాముల బోరాన్, 13.0.45 10 గ్రాములు వంతున పిచికారీ చేయాలని సూచించారు. పండ్ల తోటల రైతులు ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపంజాణి: స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో 9వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అధ్యక్షతన పెద్దపంజాణి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలన్నారు. అదేవిధంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.


నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రగౌడ్ తల్లి పార్వతమ్మ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మండలంలోని గెస్నింపల్లిలోని మృతురాలి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్, నాయకులు శ్రీరాములురెడ్డి, అయ్యాత్‌బాషా, మురళి, ఎంపీటీసీ మురుగేష్ ఉన్నారు.

ఏనుగుల సమస్య పరిష్కరించరూ!



సీఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని ఇస్తున్న ఉమాపతినాయుడు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న ఏనుగుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని చూపాలని రైతు కూలీ సంఘ నాయకులు ఉమాపతినాయుడు మంగళవారం కుప్పంలో సీఎం చంద్రబాబును కలిసి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కౌండిన్యలోని 130 ఏనుగుల కారణంగా రైతుల పంటలకు నష్టాలు తప్పడం లేదని, ఇప్పటికే పదుల సంఖ్యలో రైతుల మరణాలు జరిగాయన్నారు. తాజాగా కుంకీ ఏనుగులను ఇక్కడ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు. కానీ వీటితోనైనా సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ఇక్కడి రైతులకు లేదన్నారు. ముఖ్యంగా ఒంటరి ఏనుగులను అదుపు చేయడం ఎలిఫెంట్ ట్రాకర్ల నుంచి సాధ్యం కాలేదన్నారు. కౌండిన్య చుట్టూ బలమైన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే మినహా ఈ సమస్యకు పరిష్కారం లేదని తెలిపారు. ఈ విషయాలను సీఎంకు అందించిన వినతి పత్రంలో స్పష్టంగా తెలిపామన్నారు.

ఉద్యోగుల కష్టాలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

పలమనేరు: ఉద్యోగుల కష్టాలను ప్రభుత్వాలు గుర్తించాలని ఏపీఎన్జీఓ నేత ఆనంద్‌బాబు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుందేలు పరుగులాగా పెరుగుతున్న ధరలు, తాబేలు నడకలాగా ఉద్యోగులకు పెరగని జీతాల మధ్య ఉద్యోగులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మధ్యంతర భృతిని కూటమి ప్రభుత్వం ప్రకటించి వెంటనే పీఆర్‌సీ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న ఒత్తిడి మంచిది కాదన్నారు. బీసీ ఉద్యోగుల సంఘ నాయకులు లక్ష్మీపతి, నేతలు సోమసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాబూ..మాగోడు పట్టదా?



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఆవులనత్తం గ్రామస్తులు

–ఆవులనత్తం గ్రామస్తుల వినూత్న నిరసన

కుప్పం రూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జెల్లీ ఫ్యాక్టరీ వల్ల తమ గ్రామం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన చేస్తున్నా పట్టించుకోరా? అని మండలంలోని ఆవులనత్తం గ్రామస్తులు సూటిగా ప్రశ్నించారు. కుప్పం మండలంలోని ఆవులనత్తం గ్రామస్తులు మూడురోజులుగా ఆందోళన చేస్తుండడం విదితమే. జెల్లీ ఫ్యాక్టరీ వల్ల తమ పంటలు సరిగ్గా పండడం లేదని, ఫ్యాక్టరీ శబ్దాలకు ఇళ్ల గోడలు పగుళ్లు బారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆందోళనలో భాగంగా మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ ప్రారంభించినప్పటి నుంచి తమ జీవితాలకు ప్రశాంతత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. పగటి పూట ప్రశాంతంగా ఉండలేక పోతున్నామని, ఫ్యాక్టరీ శబ్దాల ధాటికి పిల్లలు ఉలిక్కిపడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం తమ సమస్యను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తమ సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాపు

పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాపు ప్రారంభమైంది. కళాశాలలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్సు ఆధ్వర్యంలో డీప్ జనరేటివ్ లెర్నింగ్ అనే అంశంపై ఐదు రోజుల జాతీయ వర్కుషాపు మొదలైంది. బెంగళూరుకు చెందిన జ్యాప్రొసెస్ అనే సంస్థ సీఈఓ విజయ్‌పవన్‌పులి చీఫ్ గెస్ట్‌గా హాజరై మాట్లాడారు. ఈ విధానం ద్వారా ఆధునిక ఉత్పాదకత, ఫౌండేషన్ మోడళ్లకు మూలాధారంగా మారుతుందన్నారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎన్నో ఆవిష్కరణలకు కొత్త మార్గాలను చూపిస్తుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ అడ్వైజర్ డా.రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్‌ఓడీ లోకేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రరెడ్డి

ఎంవీఆర్ విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీసుధ

పలమనేరు: పట్టణంలోని ఎంవీఆర్ కళాశాలలో మంగళవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 15మంది విద్యార్థులు టెక్ మహేంద్రా కంపెనీలో ఉద్యోగాలను సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.5లక్షల వేతనం ఉంటుందని కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి తెలిపారు.



మంచు కోట

జనవరి మొదటి వారంలోనే చలి చంపేస్తోంది. మండలంలో క్రమేణా వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు వీడడం లేదు. సాయంత్రం తిరిగీ చలిపంజా విసురుతోంది. వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. - వి.కోట

ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



కోలాటం ప్రదర్శిస్తూ విద్యార్థినుల సందడి

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థులు పొంగళ్లు పెట్టడం రంగోళి కార్యక్రమాలు, భోగిమంటలు, కోలాటాలు మొదలగు సంప్రదాయ పద్ధతులను చేపట్టారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు పండుగలు వాటి ప్రాశస్త్యాలను వివరించారు. మన పూర్వీకుల సంప్రదాయాలను మనం పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, కల్చరల్ కో–ఆర్డినేటర్ ఈ.వాసు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.